RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 483 | 02,అక్టోబర్ శుక్రవారం 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--




## దేవుళ్ల మధ్య చిచ్చు

### : రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు

శివుడు, రాముడిపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం

దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగడంపై కిషన్ రెడ్డి అభ్యంతరం

ఇచ్చిన హామీలు పక్కనపెట్టి కొత్త వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపణ



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పరమేశ్వరుడు పేదల దేవుడని, శ్రీరాముడు ధనికుల దేవుడని సీఎం చేసిన వ్యాఖ్యలు మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విమర్శలు చేశారు.ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలతో ఏకంగా దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగారని కిషన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. శివుడు, రాముడి పేర్లతో చేసిన ఈ వ్యాఖ్యలు యావత్ హిందూ సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని, హిందువుల మధ్య అనవసర గొడవలు పెట్టే ప్రయత్నమని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనపెట్టి, ఇలాంటి కొత్త వివాదాలను ముందుకు తెస్తోందని ఆరోపించారు. ప్రజలను విభజించడం కాంగ్రెస్ పార్టీకి ఎప్పటినుంచో ఉన్న అలవాటు అని ఆయన వ్యాఖ్యానించారు.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ఒక సవాల్ విసిరారు. "హిందూ దేవుళ్లపై మాట్లాడిన విధంగా ఇతర మతాల దేవుళ్ల గురించి మాట్లాడే ధైర్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందా?" అని ఆయన ప్రశ్నించారు.

## మా ఆస్తులు.. మీ ఆస్తులు..

# విచారణకు సిద్ధమా?

### : సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్!



తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల వ్యవహారం మరోసారి వేడెక్కింది. సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. తమ కుటుంబ ఆస్తులతో పాటు రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపైనా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ విచారణలో తమ తప్పు తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్ల పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి తమ కుటుంబ ఆస్తులపై చేసిన ఆరోపణలకు కేటీఆర్ స్పందించారు. వ్యాపారం చేయడం తప్పా? అని ప్రశ్నించారు. తాను 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించానని చెప్పారు. ప్రస్తుతం మూడు హోటళ్లు ఉన్నాయని తెలిపారు. తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లలో వెల్లడించానని పేర్కొన్నారు.సిరిసిల్లలో చేనేత కార్మికుల సమస్యలను సీఎం పట్టించుకోలేదని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న 35 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల పరిహారం ప్రకటిస్తారని ఆశించామని చెప్పారు. అయితే సీఎం తన పర్యటనలో రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకే తమ కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇలాంటి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు.

ఇక హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

## మమతా వర్గానికి సుప్రీంలో చుక్కెదురు...

### రూ.804 కోట్ల ఖాతాలపై పిటిషన్ కొట్టివేత



పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వర్గానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. స్తంభింపజేసిన నాలుగు బ్యాంకు ఖాతాలను వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం తోసిపుచ్చింది. ఈ ఖాతాల్లో సుమారు రూ. 804 కోట్ల మేర నిధులు ఉన్నట్లు సమాచారం.జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ పి.బి. వరాలేలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. కలకత్తా హైకోర్టు గతంలో జారీ చేసిన ఉత్తర్వులలో జోక్యం చేసుకునేందుకు ధర్మాసనం నిరాకరించింది. పార్టీలో నెలకొన్న వర్గపోరు కారణంగా కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే పార్టీ గుర్తును స్తంభింపజేసిందని, ఈ నేపథ్యంలో సదరు నిధుల యాజమాన్య హక్కులపై స్పష్టత రావాల్సి ఉందని కోర్టు అభిప్రాయపడింది. ఈ దశలో నిధుల వినియోగంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేమని స్పష్టం చేస్తూ, కేసు విచారణను వేగవంతం చేయాలని కలకత్తా హైకోర్టును ఆదేశించింది.ఆర్థిక అవకతవకల ఆరోపణలు, పలు ఎఫ్ఐఆర్‌ల నమోదు నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ పోలీసులు ఈ నాలుగు ఖాతాలను స్తంభింపజేశారు. దీనిపై మమతా వర్గం కలకత్తా హైకోర్టును ఆశ్రయించగా, ఆగస్టు 27న వారికి ఎటువంటి మధ్యంతర ఊరట లభించలేదు. అయితే, రోజువారీ పార్టీ నిర్వహణ ఖర్చుల కోసం కోర్టు నియమించిన ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో ఇతర ఖాతాలను పరిమితంగా వినియోగించుకోవడానికి హైకోర్టు అనుమతినిచ్చింది. ఖాతాల స్తంభనతో పార్టీ కార్యకలాపాలు నిలిచిపోతున్నాయని మమతా వర్గం వాదించినప్పటికీ, సుప్రీంకోర్టు మాత్రం హైకోర్టు నిర్ణయాన్నే సమర్థించింది.

## బీసీ రిజర్వేషన్లు

### : టీడీపీ, వైసీపీలపై విజయసాయి రెడ్డి తీవ్ర విమర్శలు



బీసీలను టీడీపీ, వైసీపీ మోసం చేస్తున్నాయన్న విజయసాయి బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలుగుదేశం, వైసీపీ నాటకాలాడుతున్నాయని, ఓట్ల కోసం బీసీలను మోసం చేస్తున్నాయని మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను హైకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో ఆయన ఈ విధంగా స్పందించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించేలా ఉన్నాయని పేర్కొంటూ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోలను హైకోర్టు కొట్టివేసింది. ఆరు వారాల్లోగా ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ తీర్పుపై విజయసాయి రెడ్డి స్పందిస్తూ... రెండు పార్టీలు ఇదే తరహా రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. "చట్టపరంగా నిలబడవని తెలిసి కూడా రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటేలా ప్రభుత్వం జీవోలు ఇవ్వడం, ఆ తర్వాత దానికి వ్యతిరేకంగా వెనువెంటనే కోర్టుల్లో కేసులు వేయించడం వీరికి పరిపాటిగా మారింది" అని ఆయన ఆరోపించారు. ఈ విధంగా బీసీలను మభ్యపెట్టి, కోర్టు తీర్పులు రాగానే ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆయన మండిపడ్డారు.

## కూతురు పొలిటికల్ ఎంట్రీ ప్రచారంపై

# మంత్రి నారాయణ క్లారిటీ



తన కుమార్తె షరణి రాజకీయ ప్రవేశంపై వస్తున్న వదంతులకు ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణ తెరదించారు. తన కుటుంబం నుంచి ఎవరూ రాజకీయాల్లోకి రారని, తన కుమార్తె మేయర్‌గా పోటీ చేస్తారంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. నెల్లూరులో మీడియాతో మాట్లాడుతూ, ఈ ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేశారు.తనపై ఎన్ని ఆరోపణలు వచ్చినా తాను పట్టించుకోనని మంత్రి నారాయణ అన్నారు. "కామెర్ల రోగికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది" అంటూ తనపై విమర్శలు చేస్తున్న వారిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తాను ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానని తెలిపారు.అంతకుముందు, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి నారాయణ వివరించారు. గత రెండేళ్లలో రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో వేలాది మందికి శాశ్వత నివాస ధ్రువీకరణ పట్టాలు అందించామని చెప్పారు. నెల్లూరులో ఇప్పటికే 1,450 మందికి పట్టాలు ఇచ్చామని, త్వరలోనే మరో 1,250 మందికి అందిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి ఎన్నికల్లో విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణ ఉద్యోగులు ,

# పెన్షనర్లకు శుభవార్త

దసరా పండుగను పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏల్లో రెండింటికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఉద్యోగులు, పెన్షనర్లకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ బకాయిలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈరోజు సమావేశమైన కేబినెట్ సానుకూల నిర్ణయం తీసుకుంది.మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను వారు ఈ సందర్భంగా వివరించారు. రెండు డీఏల వల్ల ప్రభుత్వంపై సుమారు రూ. 2,500 కోట్ల అదనపు ఆర్థిక భారం పడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగినట్లు మంత్రులు పేర్కొన్నారు. నిన్న ఒక్కరోజే 19,892 మెగావాట్ల విద్యుత్ వినియోగం నమోదైనట్లు వారు వెల్లడించారు. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం నిన్నటితో వర్షాకాలం ముగిసిందని, ఈ ఏడాది సగటున 17 శాతం వర్షపాతం తక్కువగా నమోదైందని తెలిపారు. రాష్ట్రంలోని సుమారు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, ఎల్ నినో ప్రభావంపై కేబినెట్ అత్యవసర నివేదికను సిద్ధం చేస్తోందని మంత్రులు వివరించారు.కేంద్ర ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా 5,800 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు టెండర్లు పిలవాలని కేబినెట్ నిర్ణయించినట్లు మంత్రులు వెల్లడించారు. వీటితో పాటు 'తెలంగాణ డిజిటల్ మీడియా అండ్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీ'కి కూడా రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని వారు పేర్కొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
02,అక్టోబర్ శుక్రవారం 2026

# 4న సికింద్రాబాద్‌లో 'నమోత్థుణం జప మహాకుంభం'

## శ్రీ వర్ధమాన్ స్థానక్‌వాసి జైన్ శ్రావక్ సంఘ్ చైర్మన్ స్వరూప్ చంద్ కొఠారి

**హైదరాబాద్, అక్టోబర్ 01:**




లోక కల్యాణం, ఆత్మశుద్ధి, పాప ప్రక్షాళన కోసం జైన గురువు ఆచార్య జ్ఞాన్‌చంద్ జీ మహారాజ్ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన సికింద్రాబాద్ ఇంపీరియల్ గార్డెన్స్‌లో 'నమోత్థుణం జప మహాకుంభం' నిర్వహించనున్నట్లు శ్రీ వర్ధమాన్ స్థానక్‌వాసి జైన్ శ్రావక్ సంఘ్ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ స్వరూప్ చంద్ కొఠారి, అధ్యక్షుడు అన్‌రాజ్ బఫ్నా, ప్రధానకార్యదర్శి పవన్‌కుమార్ కటారియా తెలిపారు.

ఆచార్య జ్ఞాన్‌చంద్ జీ మహారాజ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని నగరంలో ఈ నెల 2, 3, 4 తేదీల్లో పలు ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతినిధులు వెల్లడించారు. ఈ సందర్భంగా కార్యక్రమ వివరాల పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు.

అనంతరం వారు మాట్లాడుతూ... ఆచార్య జ్ఞాన్‌చంద్ జీ మహారాజ్ 13వ ఏటనే జైన దీక్ష స్వీకరించి, గత 52 సంవత్సరాలుగా సన్యాస జీవితాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు రాజస్థాన్, గుజరాత్ తదితర ప్రాంతాల్లో సుమారు 55 వేల కిలోమీటర్లు పాదరక్షలు లేకుండా పాదయాత్ర చేశారని పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ నుంచి తీవ్ర ఎండలను సైతం లెక్కచేయకుండా సుమారు 1,800 కిలోమీటర్లు పాదయాత్ర చేసి హైదరాబాద్‌కు చేరుకున్నారని తెలిపారు.

భగవాన్ మహావీర్ బోధించిన సత్యం, అహింస, మద్యపానానికి దూరంగా ఉండటం, మాంసాహారాన్ని వర్జించడం, దొంగతనం, జూదానికి దూరంగా ఉండటం వంటి సూత్రాలను ప్రజలకు తెలియజేస్తూ... సమాజంలో సోదరభావం, శాంతి, నైతిక విలువలను పెంపొందించడమే ఆచార్య జ్ఞాన్‌చంద్ జీ మహారాజ్ లక్ష్యమని వారు పేర్కొన్నారు. 'మొదట దేశం తర్వాతే మతం' అనే సందేశాన్ని ఆయన ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని చెప్పారు.

ఆచార్య జ్ఞాన్‌చంద్ జీ మహారాజ్ జన్మదిన వేడుకల్లో భాగంగా అక్టోబర్ 2న నెక్లెస్ రోడ్ నుంచి 'అహింసా కార్ ర్యాలీ' నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతీయ సమైక్యతను చాటేలా ఈ ర్యాలీలో ముందుగా త్రివర్ణ పతాకం, అనంతరం జైన పంచరంగుల పతాకాన్ని ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.

అలాగే భాగ్యనగర్ గోశాలలో రెండు రోజుల పాటు ధర్మసభ నిర్వహిస్తారని తెలిపారు. ఈ వేడుకలో వివిధ రాష్ట్రాల నుంచి 1,008 జంటలతో పాటు 3,000 మంది భక్తులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వినోద్ కిమ్మి, ధర్మేంద్ర నహార్, ధర్మీచంద్ భండారీ, గౌతమ్‌చంద్ డెంక్, సురేష్‌చంద్ సిసోదియా, నేమిచంద్ ఉబకియా, అశోక్ కుమార్ తాతే తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ చేనేతకు ప్రపంచ మార్కెట్

## - ఈ-కామర్స్‌తో విస్తృత విక్రయాలు..

## - ఎక్స్‌పోర్ట్ హబ్‌తో ఎగుమతులకు కార్యాచరణ

**వరంగల్, అక్టోబర్ 1, హైదరాబాద్ ఎస్టేట్:**

వరంగల్ చేనేత ఉత్పత్తులకు దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. స్థానికంగా తయారవుతున్న చేనేత ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడంతో పాటు ఆన్‌లైన్, ఈ-కామర్స్ వేదికలను సమర్థంగా వినియోగించి ఇతర ప్రాంతాలు, విదేశీ మార్కెట్లకు చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గురువారం కొత్తవాడలోని మట్టేవాడ, దయానంద్ చేనేత క్లస్టర్లను సందర్శించిన కలెక్టర్ ఉత్పత్తుల తయారీ విధానాన్ని పరిశీలించారు. చేనేత కార్మికులకు అవసరమైన మౌలిక వసతులు, సాంకేతిక సహకారం, మార్కెటింగ్ సదుపాయాలపై అధికారులతో చర్చించారు. కార్మికులు, ఉత్పత్తిదారుల సంఘాలకు సాంకేతిక శిక్షణతో పాటు నాణ్యత ప్రమాణాలు, బ్రాండింగ్, ప్యాకేజింగ్‌లో అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు. వరంగల్ ఎక్స్‌పోర్ట్ హబ్‌ను వినియోగించుకుని జిల్లాలో తయారయ్యే చేనేత, ఇతర స్థానిక ఉత్పత్తులకు ఎగుమతి అవకాశాలను పెంచేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో అభివృద్ధి చెందుతున్న పర్యాటక రంగంతో చేనేత ఉత్పత్తులను అనుసంధానం చేసి సందర్శకులకు స్థానిక ఉత్పత్తులను పరిచయం చేయడం ద్వారా మార్కెటింగ్ అవకాశాలను పెంచాలని పేర్కొన్నారు. నాణ్యత, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, బ్రాండింగ్, ఆధునిక మార్కెటింగ్ విధానాలపై దృష్టి సారించి వరంగల్ చేనేత ఉత్పత్తులకు దేశ, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు వచ్చేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పరిశీలనలో జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నరసింహమూర్తి, రాష్ట్ర చేనేత వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.





# రూ.2.21 కోట్ల ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

## - 340 పనులపై 18వ విడత ప్రజా వేదిక..

## - పనులు, ఖర్చులపై పరిశీలన




**గీసుగొండ, అక్టోబర్ 1, హైదరాబాద్ ఎస్టేట్:**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 202526 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన 340 పనులకు సంబంధించిన రూ.2,21,54,688 వ్యయంపై 18వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం జరిగిన ప్రజా వేదికలో 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు చేపట్టిన పనులు, వాటికి సంబంధించిన లెక్కలు, రికార్డులను పరిశీలించారు. గ్రామీణ ఉపాధి పథకం ద్వారా చేపట్టిన 325 పనులకు రూ.1,06,98,930, పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన 14 పనులకు రూ.1,10,10,334, అటవీ శాఖ ద్వారా చేపట్టిన ఒక పనికి రూ.4,45,424 వ్యయం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. మూడు శాఖల పరిధిలో చేపట్టిన పనులకు కలిపి రూ.2.21 కోట్లకు పైగా నిధులు వెచ్చించిన నేపథ్యంలో వాటి పనితీరు, లెక్కలు, సంబంధిత రికార్డులను ప్రజా వేదికలో పరిశీలించారు. ప్రజా వేదికను మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి (ఎఫ్ఏసీ) ఏఎంవీ కమలాకర్ నిర్వహించగా, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగ పద్మజ నిర్ణయాధికారిగా హాజరై పనులు, రికార్డులను పరిశీలించారు. జిల్లా పర్యవేక్షణ అధికారి విమల, సహాయ జిల్లా పర్యవేక్షణ అధికారి మాధవి, సమన్వయకర్త సురేష్‌తో పాటు ఆడిట్ కాలం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కృష్ణవేణి, మండల పంచాయతీ అధికారి శేషాంజనేయులు, పంచాయతీరాజ్ సహాయ ఇంజనీర్ అనిల్, సామాజిక తనిఖీ రాష్ట్ర వనరుల వ్యక్తి రాజ్‌కుమార్, సంబంధిత బృందం పాల్గొన్నారు. గ్రామీణాభివృద్ధి సిబ్బంది, సహాయక కార్యక్రమ అధికారి చంద్రకాంత్, ఉపాధి సహాయకురాలు శ్రీలత, సాంకేతిక సహాయకులు టీఎస్ఎన్ సింగ్, సుష్మా, కంప్యూటర్ నిర్వహణ సిబ్బంది నరేష్, రాజేష్, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, మేట్లు పాల్గొన్నారు. సామాజిక తనిఖీ ప్రక్రియ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

# కల్వకోలు సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ కుమారుడు రవి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన నాయకులు

**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి అక్టోబర్ 01:)**



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ కుమారుడైన బక్కని రవి మాదిగ పుట్టినరోజు వేడుకలను ఆవుల శివాజీ ఫంక్షన్ హాల్ లో చాలా ఘనంగా అంగరంగ వైభవంగా జరుపుకోవాలని జరిగింది. ఈ వేడుకకు రెండు మూడు వందల మంది ప్రజలు హాజరవ్వడం జరిగింది. నిండు నూరేండ్లు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు. మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు, మునిగపాటి నవీన్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గాదే థామస్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, రమేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, రవీందర్, బక్కని అశోక్, అంజయ్య రామస్వామి, బడుసు ప్రవీణ్, బబ్లు, దుబాయ్ చంద్ర సర్పంచ్ సెల్వ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు ఉపసర్పంచులు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావడం జరిగింది,

# 5 వేల ప్రాణాలకు రక్తబంధం

## - 2013 నుంచి నిర్విరామ సేవలు..

## - నేతాజీ సర్వీస్ టీమ్‌కు జాతీయ రక్తదాన అవార్డు

**గీసుగొండ, అక్టోబర్ 1, హైదరాబాద్ ఎస్టేట్:**




రక్తం కోసం ఎదురుచూస్తున్న ప్రాణాలకు అండగా నిలుస్తూ.. 5 వేల మందికి పైగా రక్తదాతలను సమకూర్చిన గీసుగొండ మండలం ఊకల్ హవేలీకి చెందిన మొగసాని శంకర్‌కు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. 2013లో స్థాపించిన నేతాజీ సర్వీస్ టీమ్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో రక్తదాతలను సమకూర్చి పలువురి ప్రాణాలు కాపాడిన సేవలకు గుర్తింపుగా జాతీయ స్వచ్ఛంద రక్తదాన అవార్డును అందుకున్నారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉపేందర్, బ్లడ్ బ్యాంక్ మేనేజర్ సంయుక్త, కమలాపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్ చేతుల మీదుగా శంకర్ అవార్డును స్వీకరించారు. గీసుగొండ మండల విద్యాశాఖ కార్యాలయంలో కాంట్రాక్టు అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న శంకర్.. ఉద్యోగ బాధ్యతలతో పాటు రక్తదాన సేవలను కొనసాగిస్తున్నారు. రోగికి అత్యవసరమైన రక్తగ్రూప్ అవసరమైనప్పుడు శంకర్‌కు ఫోన్ చేయగానే తన సంస్థ ద్వారా రక్తదాతలను సమకూర్చుతున్నారని బ్లడ్ బ్యాంక్ మేనేజర్ సంయుక్త తెలిపారు. ఇలాంటి సేవలతో ఎంతోమంది ప్రాణాలు నిలిచాయని, నేతాజీ సర్వీస్ టీమ్ చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఎంజీఎం సూపరింటెండెంట్ ఉపేందర్ మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ఒక ప్రాణాన్ని కాపాడటమే కాకుండా ఆ వ్యక్తి కుటుంబాన్ని నిలబెట్టినట్లేనని అన్నారు. యువత స్వచ్ఛంద రక్తదానంలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంజీఎం బ్లడ్ బ్యాంక్ సిబ్బంది శ్రీనివాస్, రాకేష్, సతీశ్, వైద్యులు, సన్మాన అతిథులు పాల్గొన్నారు.

# రామస్వామి కుటుంబానికి కాంగ్రెస్ నేతల చేయూత

## - అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సాయం

**గీసుగొండ, అక్టోబర్ 1, హైదరాబాద్ ఎస్టేట్:**



ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మార్గం రామస్వామి కుటుంబాన్ని కొనాయమాకుల గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి కష్టకాలంలో అండగా నిలిచారు. తమ వంతు సహాయంగా రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. రామస్వామి మృతితో కుటుంబానికి కలిగిన నష్టంపై నాయకులు విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి కష్ట సమయంలో కుటుంబానికి తోడుగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అవసరమైన సమయంలో తమ సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని రామస్వామి కుటుంబానికి తమ సానుభూతిని తెలిపారు.



# వృద్ధుల అనుభవం..

## భావితరాలకు మార్గదర్శకం

### - ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా సన్మానం..

### - పండ్లు, ఆహార పదార్థాల పంపిణీ





**గీసుగొండ, అక్టోబర్ 1, హైదరాబాద్ ఎస్టేట్:**

వృద్ధుల అనుభవాలను గౌరవిస్తూ, వారి పట్ల సమాజ బాధ్యతను చాటుతూ గంగాదేవిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అభ్యుదయ వీఓ అధ్యక్షురాలు లావణ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వృద్ధులను శాలువాలతో సత్కరించి, పండ్లు, ఆహార పదార్థాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కూసం స్వరూప రమేష్ వృద్ధులను సత్కరించారు. సెర్ప్ కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ బొజ్జ సురేశ్ మాట్లాడుతూ.. వృద్ధుల జీవిత అనుభవాలు నేటి యువతకు విలువైన పాఠాలను అందిస్తాయని అన్నారు. వారి అనుభవాలను భావితరాలకు చేరేలా చూడడంతో పాటు, కుటుంబాల్లో వృద్ధులకు తగిన ఆదరణ కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాజు, వీఓ కార్యదర్శి పరమేశ్వరి, కోశాధికారి వినోద, వీఓఏ పెండ్లి జనార్ధన్, మహిళలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## కాచిగూడ ఇన్‌స్పెక్టర్‌ను సత్కరించిన ఎమ్మార్పీఎస్



కాచిగూడ, అక్టోబర్ 01: నూతనంగా ఎన్నికైన ఎమ్మార్పీఎస్ గోల్నాక డివిజన్ కమిటీ సభ్యులు గురువారం కాచిగూడ పోలీసు ఇన్‌స్పెక్టర్ ఎస్. రాజశేఖర్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ బాధ్యులు ఎడవల్లి యాదయ్య మాదిగ, ఎమ్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చెడిపెల్లి రఘు మాదిగ, గోల్నాక విభాగ బాధ్యులు బొజ్జ రాజు మాదిగ, నల్లకుంట విభాగ అధ్యక్షుడు రమేష్ (ఫిలిప్స్) మాదిగ, గోల్నాక డివిజన్ అధ్యక్షుడు సుక్క ఆకాశ్ మాదిగ, ప్రధాన కార్యదర్శులు జి. శ్రవణ్ కుమార్ మాదిగ, కె. జాన్సన్ మాదిగ, నాయకులు ఎమ్. రోహిత్ మాదిగ, సుక్క సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీలో చేరిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు

### మునుగోడు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే

### కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



**మర్రిగూడ అక్టోబర్ 01 (హైద్రాబాద్ ఎస్టేట్):-**

మర్రిగూడ మండల కేంద్రంలో మునుగోడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పలువురు సీనియర్ నాయకులు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆదివాసి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమావత్ శ్రీను నాయక్ మరియు మైనార్టీ నాయకుడు ఎస్ కే సలీం పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు మునుగోడు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఆయన అన్నారు రమావత్ శ్రీను నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫ్లమైందని అన్నారు కాంగ్రెస్ పార్టీ బూటకపు మాటలు నమ్మి తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఓట్లు వేసి తప్పు చేశారని ఆయన అన్నారు తెలంగాణ ప్రజలు కేసీఆర్ రావాలి రేవంతు పోవాలి అనే నినాదంతో ఉన్నారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్ మండల రైతు బంధు సమితి మాజీ కన్వీనర్ బచ్చు రామకృష్ణ మాజీ ఎంపీపీ మెండు మోహన్ రెడ్డి యరగండ్లపల్లి గ్రామ సర్పంచ్ వల్లెంల సంతోష్ యాదవ్ అజ్జలాపురం సర్పంచ్ రొకం భాస్కర్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు చెరుకు శ్రీరామ్ గౌడ్ (రైతన్న) నల్ల యాదయ్య గౌడ్ తెలంగాణ ఉద్యమకారుడు బురుగు నాగరాజు గుప్త రాపోలు యాదగిరి కొండాపురం నరేష్ పలువురు ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# సైబర్ మోసం జరిగితే 1930కు కాల్ చేయాలి

### - గోల్డెన్ అవర్‌ను సద్వినియోగం చేసుకోవాలి..

### - ఓటీపీ, పిన్ వివరాలు పంచుకోవద్దు

**వరంగల్, అక్టోబర్ 1, హైదరాబాద్ ఎస్టేట్:**

సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సైబర్ క్రైమ్ రిసోర్స్ పర్సన్ రమేష్ సూచించారు. కీర్తినగర్‌లో శ్రీ ధరణి స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కల్లెపు శోభారాణి ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో మహిళలు, రైతులు, యువకులు, విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ నకిలీ యాప్‌లు, అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, సోషల్ మీడియా సందేశాల ద్వారా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో భయపెట్టి డబ్బులు వసూలు చేసే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ మోసం జరిగినప్పుడు భయపడకుండా వెంటనే గోల్డెన్ అవర్‌లో 1930కు ఉచితంగా కాల్ చేయాలని సూచించారు. ఓటీపీ,




పిన్, బ్యాంకు ఖాతా, వ్యక్తిగత వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకూడదని సూచించారు. ఆన్‌లైన్ గేమ్స్ లేదా ఇతర యాప్‌లలో డబ్బులు కోల్పోయినా సమస్యను దాచుకోకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు. ఎఫ్ఎల్‌సీ కోఆర్డినేటర్ భాస్కరచారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత పెంపొందించుకోవాలని సూచించారు.



బ్యాంకింగ్ సేవలు, పొదుపు, బీమా, పెన్షన్, రుణాలు, డిజిటల్ చెల్లింపులు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెప్మా సీఓ రజిత, ఆర్‌పీలు నీరజ, రమాదేవి, లక్ష్మీ, గాయత్రి, ఫీల్డ్ ఆఫీసర్ కీర్తన, కళాకారులు రాజేందర్, కనకరాజు, స్వయం సహాయక సంఘాల మహిళలు, వ్యాపారులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన బాధ్యతలు స్వీకరించిన మహేశ్వరం మాజీ ఎంపీటీసీ పోతర్ల సుదర్శన్ యాదవ్.

హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి
అక్టోబర్ 1

రంగారెడ్డి జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా పోతర్ల సుదర్శన్ యాదవ్ నియమితులయ్యారు. నూతన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచంద్రరావు , రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షులు గందమళ్ల ఆనంద్ గౌడ్ బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజభూపాల్ గౌడ్ హృదయపూర్వక ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, పార్టీ కోసం పూర్తి సమయం కేటాయించి, అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చాను మరింత బలోపేతం చేయడంతో పాటు, ఓబీసీ వర్గాల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చేవెళ్ల



ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి , బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుళ్ల వీరేందర్ గౌడ్ , రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షులు గందమళ్ల ఆనంద్ గౌడ్ , రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీ పంతంగి రాజభూపాల్ గౌడ్ , మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన బాధ్యతలు స్వీకరించిన పోతర్ల సుదర్శన్ యాదవ్ కి నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ఈ




కార్యక్రమంలో బీజేపీ మహేశ్వరం మండల మీడియా కన్వీనర్ మోతే యాదయ్య , రవీందర్ రెడ్డి , బూత్ అధ్యక్షులు రాఘవేందర్ , నరేష్ , గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# జోల పాటలో అమ్మ ప్రేమ..

## సమ్మక్క పాటలో పోరాట స్ఫూర్తి!

### ‘అమ్మ పాడే జోల పాట’,కండ్లల్లో కన్నీళ్లు సమ్మక్క’తో మెప్పించిన అశ్వినీ రాథోడ్

**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**

**జయశంకర్ భూపాలపల్లి:**

పల్లె గుండెల్లో పుట్టిన గళం.. ప్రతిష్ఠాత్మక వేదికపై తన స్వర మాధుర్యంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. జయశంకర్ జిల్లా గాయని అశ్వినీ రాథోడ్ జీ తెలుగులో ప్రసారమవుతున్న సరిగమప కార్యక్రమంలో తనదైన గాత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. పాటలోని భావాన్ని తన స్వరంలో పలికిస్తూ.. రెండు తెలుగు రాష్ట్రాల సంగీతాభిమానుల ప్రశంసలు అందుకుంటున్నారు.

సరిగమప వేదికపై అశ్వినీ రాథోడ్ ఆలపించిన ‘అమ్మ పాడే జోల పాట’ తల్లి ప్రేమను, మమతను, ఆప్యాయతను గుర్తుచేసేలా సాగింది. తన మృదువైన గాత్రంతో జోలపాటలోని భావాన్ని అద్భుతంగా పలికించిన అశ్వినీ ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేశారు. పాటను ఆలపించే సమయంలో ఆమె చూపించిన భావవ్యక్తీకరణ, స్వరంలోని సహజత్వం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

అదే విధంగా ‘కండ్లల్లో కన్నీళ్లు సమ్మక్క’ పాటతో తెలంగాణ వీరనారి సమ్మక్క పోరాట స్ఫూర్తిని, జానపద గీతంలోని ఆవేదనను తన గాత్రంలో ఆవిష్కరించారు. పాటలోని ప్రతి పదానికి తగిన భావాన్ని అందిస్తూ అశ్వినీ ఆలపించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంది. తెలంగాణ సంస్కృతి, చరిత్ర, పల్లె మట్టితో ముడిపడిన భావాలను తన గానంలో ప్రతిబింబించారు.



కూతురు పాడుతుంటే.. తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందభాష్పాలు

అశ్వినీ రాథోడ్ సరిగమప వేదికపై పాట పాడుతుండగా ఆమె తల్లిదండ్రులు భావోద్వేగానికి గురయ్యారు. తమ కూతురు ప్రతిష్ఠాత్మక వేదికపై నిలబడి అద్భుతంగా పాట పాడుతుండటాన్ని చూస్తూ వారి కళ్లల్లో ఆనందంతో కన్నీళ్లు తిరిగాయి. కూతురు సాధించిన గుర్తింపును చూస్తూ తల్లిదండ్రులు మురిసిపోయిన తీరు కార్యక్రమంలో ప్రత్యేక భావోద్వేగ క్షణంగా నిలిచింది. తమ కూతురు గాన ప్రతిభకు లభిస్తున్న ఆదరణ చూసి వారు ఆనందం వ్యక్తం చేశారు.

**ప్రముఖుల ప్రశంసలు**

అశ్వినీ రాథోడ్ గాన ప్రతిభకు సినీ, సంగీత రంగాలకు చెందిన ప్రముఖుల నుంచి ప్రశంసలు లభించాయి. ప్రముఖ సినీ దర్శకుడు అనిల్ రావిపూడి, ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, ప్రముఖ గాయని ఎస్.పీ. శైలజ తదితరులు ఆమె గాన ప్రతిభను అభినందించారు. ప్రముఖుల నుంచి వచ్చిన ప్రశంసలు అశ్వినీకి మరింత ప్రోత్సాహాన్ని అందించాయి.

**జయశంకర్ జిల్లా నుంచి సరిగమప వేదిక వరకు..**

జయశంకర్ జిల్లా నుంచి వచ్చిన అశ్వినీ రాథోడ్ సరిగమప వంటి ప్రతిష్ఠాత్మక వేదికపై తన ప్రతిభను చాటుకోవడం జిల్లా ప్రజల్లో ఆనందం నింపుతోంది. పల్లె పాటలకు తన స్వరంతో ప్రత్యేక మాధుర్యాన్ని అందిస్తూ, తెలంగాణ జానపద గీతాల వైభవాన్ని ప్రేక్షకులకు చేరువ చేస్తున్నారు.

‘అమ్మ పాడే జోల పాట’లో అమ్మ ప్రేమను.. ‘కండ్లల్లో కన్నీళ్లు సమ్మక్క’లో సమ్మక్క పోరాట స్ఫూర్తిని తన గళంలో పలికించిన అశ్వినీ రాథోడ్.. సరిగమప వేదికపై జయశంకర్ జిల్లా పేరును గర్వంగా వినిపిస్తున్నారు.

రెండు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకుల నుంచి లభిస్తున్న ఆదరణతో అశ్వినీ గాన ప్రస్థానం మరింత ముందుకు సాగుతోంది. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత అవకాశాలు అందుకుని సంగీత రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని అభిమానులు, జిల్లా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in
02,అక్టోబర్ శుక్రవారం 2026

# మాదిగ విద్యార్థులు చైతన్యంతో ముందుకు సాగాలి

## వర్గీకరణ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలి..

## అక్టోబర్ 6న ఎంఎస్ఎఫ్ జాతీయ ప్రతినిధుల సభను విజయవంతం చేయాలి

**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**



చిట్యాల, అక్టోబర్ 1: ఎస్సీ వర్గీకరణ ఫలాలు విద్యా, ఉద్యోగ రంగాల్లో పూర్తిస్థాయిలో అందేలా మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఎంఆర్పీఎస్ఎంఎస్పీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జ్ మడిపల్లి శ్యామ్ మాదిగ పిలుపునిచ్చారు.
చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంఎస్ఎఫ్ జిల్లా కో ఇన్‌చార్జ్ మడిపల్లి సుమన్ మాదిగ ఆధ్వర్యంలో మాదిగ విద్యార్థుల చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మడిపల్లి శ్యామ్ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్లుగా ఉద్యమం కొనసాగించామని తెలిపారు.
వర్గీకరణ ద్వారా లభించే అవకాశాలను వృథా చేసుకోకుండా విద్యార్థులు విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించాలని సూచించారు. మాదిగ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు మేధస్సు, విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు.

అక్టోబర్ 6న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న ఎంఎస్ఎఫ్ జాతీయ ప్రతినిధుల మహాసభకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**ఎంఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక**

చిట్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంఎస్ఎఫ్ నూతన కమిటీని ఈ సందర్భంగా ఎన్నుకున్నారు.

అధ్యక్షుడిగా రాయి జస్వంత్ మాదిగ, అధికార ప్రతినిధిగా ఆసంపల్లి వివేక్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా మొలుగురి శివ మాదిగ, ఉపాధ్యక్షుడిగా కలికోట శ్రీధర్ బాబు మాదిగ, కార్యదర్శిగా గడ్డం సాయి కౌశిక్ మాదిగ, కోశాధికారిగా గుర్రపు అర్జున్ రాజ్ మాదిగ, ప్రచార కార్యదర్శిగా సంఘీ రోహిత్ మాదిగ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా పలువురు విద్యార్థి నాయకులు కొనసాగనున్నారు.

ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ చిట్యాల మండల ఇన్‌చార్జ్ బుల్లి బాబు మాదిగ, ఎంఆర్పీఎస్ఎంఎస్పీ నోముల శ్రీనివాస్ మాదిగ, జిల్లా నాయకులు నేరెళ్ల ఓదేలు మాదిగ, భూపాలపల్లి మండల ఇన్‌చార్జ్ దోర్నాల రాజేందర్ మాదిగ, ఎంఎస్పీ చిట్యాల మండల అధ్యక్షుడు దొడ్డి శంకర్ మాదిగ, చిట్యాల ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు కొల్లూరి అశోక్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమాభివందనాలతో
మడిపల్లి సుమన్ మాదిగ
మీఖీ భూపాలపల్లి జిల్లా కో ఇన్‌చార్జ్

# ఆర్టీసీని పరిరక్షించే బాధ్యత కాంగ్రెస్ దే - నడికుడా శివ

## టీడబ్ల్యూయూకు మద్దతు - బాణం గుర్తుపై ఓటు వేయాలి

## ఐఎన్ టీయూసీ జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపీ జి.సంజీవరెడ్డి




**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి అక్టోబర్ 01:)**

మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ( కేఎల్ఆర్ ) ఆదేశాల మేరకు
మహేశ్వరం నియోజకవర్గం ఐఎన్టీయూసీ కర్మిక శాఖ అధ్యక్షులు నడికుడ శివఆధ్వర్యంలో మహేశ్వరం మండలం లో ఆర్టీసీ బస్సు డిపో వద్ద మాట్లాడుతూ టి జి ఆర్ టి సి యూనియన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బాణం గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ మహేశ్వరం డిపోలో ప్రచారం నిర్వహించడం జరిగింది టీజీ ఆర్టీసీ యూనియన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ, ఐఎన్టియుసి / ఎస్ డబ్ల్యు , టీఎంయూ ,ఎస్ డబ్ల్యూ ఎఫ్ బలపరిచిన టిడబ్ల్యూ , తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గా ఉన్న మొగుళ్ల రాజిరెడ్డి యొక్క బాణం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు పోలింగ్ తేది : 09-10-2026.ఈ యొక్క కార్యక్రమంలో మహేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఆవుల యాదయ్య,మహేశ్వరం మండల గ్రామీణ పట్టణ అధ్యక్షులు బంగరు గళ్ల లాజర్, మహేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర నవీన్ కుమార్, మహేశ్వరం మండలం ఎస్సీ సెల్ అధ్యక్షులు కప్పల రాజు,మహేశ్వరం మండలం క్రిస్టియన్ మైనారటి అధ్యక్షులు బుసనగారి స్వామి,మహేశ్వరం మండలం ఎస్సీ డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షులు బాట రాజు,కందుకూర్ మండలం ఐఎన్టియుసి అధ్యక్షులు గాదే కుమార్,గంగారం తండా వార్డు మెంబర్ సభ్యులు రవి నాయక్ ,తదిరులు పాల్గొన్నారు

# ప్రధాని నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 ఏళ్ల ప్రజాసేవ

## సేవే సంకల్పం.. సమాజ సేవే లక్ష్యం!

**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి అక్టోబర్ 01:)**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న "సేవా సంకల్ప్ అభియాన్"లో భాగంగా కందుకూరు మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన "అంగన్ మిలన్ సేవ" కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బొక్క నర్సింహారెడ్డి పాల్గొన్నారు.బీజేపి మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారుల భవిష్యత్తుకు పునాది వేస్తూ, వారి విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, సమగ్ర వికాసం కోసం నిరంతరం సేవలందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బందిని ఘనంగా సత్కరించి, సేవలను అభినందించారు.
చిన్నారుల చిరునవ్వులోనే దేశ భవిష్యత్తు దాగి ఉంది. ఆ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న సేవలు ఎంతో విలువైనవి. వారి అంకితభావం, సేవా స్ఫూర్తి సమాజానికి ఆదర్శప్రాయమని ఈ సందర్భంగా కొనియాడారు.
"సేవే పరమావధి దేశమే ప్రథమం" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో మండల, ప్రధాన కార్యదర్శులు చిలుకల రఘునందన్,గౌర ప్రభాకర్ ముచర్ల ఎంపిటీసీ బక్క మల్లేష్,మండల ఉపాధ్యక్షుడు రవీందర్ గౌడ్, వెంకట్ రెడ్డి, యూవమోర్చ మండల అధ్యక్షుడు సామల దయాకర్ రెడ్డి, మండల కార్యదర్శి నర్సిమ్మా జైత్వారం ఉపసర్పంచ్ నవీన్ ముచర్ల ఉపసర్పంచ్ తెరటి రవీందర్ చెన్నయ్య క్రిష్ణ గౌడ్ వెంకటేష్ అనిల్, మహేందర్, సాయి, తదితర నాయకులు పాల్గొన్నారు.

# మడే బిక్షపతి దంపతులకు పరామర్శ

## - మాతృవియోగంలో ఉన్న దంపతులకు సన్నిహితుల మనోధైర్యం

**హనుమకొండ, అక్టోబర్ 1, హైదరాబాద్ ఎస్టేట్:**



ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎస్సీ, ఎస్టీ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడే బిక్షపతి, మడే పూర్ణిమ తల్లి మడే ముత్తమ్మ కుటుంబాన్ని సన్నిహితులు పరామర్శించారు. హనుమకొండలోని వారి నివాసానికి వెళ్లిన ములుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ హరగోపాల్ పలువురితో కలిసి దంపతులను ఓదార్చి, మనోధైర్యం కల్పించారు. ముత్తమ్మతో తమకున్న అనుబంధాన్ని, ఆమె జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ కుటుంబ సభ్యులతో తమ సానుభూతిని పంచుకున్నారు. తల్లి జ్ఞాపకాలను పదిలంగా ఉంచుకుంటూ బాధ నుంచి కోలుకుని, ఆమె ఆశయాలకు అనుగుణంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో మరింత ముందుకు సాగాలని హరగోపాల్ సూచించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి, సుగుణాకర్, కృష్ణప్రసాద్, సురేష్ తదితరులు మడే బిక్షపతిపూర్ణిమ దంపతులను పరామర్శించి తమ సానుభూతిని తెలిపారు.

# పెద్దపులి నాగారం హై స్కూల్ లో - ఉచిత వైద్య శిబిరం

## ఆరోగ్యం, సాధికారత - అందరికీ ఆరోగ్య సేవల అందుబాటు

**హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి అక్టోబర్ 1**






రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామంలో హై స్కూల్ లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు.. లో భాగంగా.. నిరుపేదలకు వైద్యం అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో... బిపి, షుగర్ బ్లడ్ పరీక్షలు,కంటి పరీక్షలు, ఉచితంగా మందులు ఇవ్వాలనే ఉద్దేశంతో ముందుకు కొనసాగుతున్నట్లుగా తెలియజేశారు... ప్రాజెక్ట్ హీల్ హైదరాబాద్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖ అతిథులు మరియు భాగస్వాములకు హృదయపూర్వక స్వాగతం.ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులు:
రేష్మి ఆయేషా హెడ్ సిఎస్ఆర్ , ఆస్టర్ డిఎం క్వాలిటీ కేర్ లిమిటెడ్ అనీషా గోస్వామి లీడ్ సిఎస్ఆర్ హైదరాబాద్, యాష్ టెక్నాలజీస్
దాదా సర్గార్ లీడ్ ఇండియా సిఎస్ఆర్ & స్ట్రాటజిక్ ఇనిషియేటివ్స్, ఆస్టర్ డిఎం క్వాలిటీ కేర్ లిమిటెడ్ జినేష్ జోసెఫ్ లీడ్ నర్సింగ్ & మెడికల్ అఫైర్స్, సిఎస్ఆర్ , ఆస్టర్ ఎండి క్వాలిటీ కేర్ లిమిటెడ్ పి. కృష్ణ మోహన్ వ్యవస్థాపకులు & సీఈఓ , ఉద్య డబను సహస్రభ ఫౌండేషన్ ( యుడిఎస్ ఫౌండేషన్ ), ఇండియా &యూఎస్ఏ
కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం
మెరుగైన ఆరోగ్యం c ఎక్కువ ఆరోగ్య సేవల అందుబాటు c బలమైన సమాజాల నిర్మాణం
హైదరాబాద్‌లో 2026లో ప్రారంభమవుతున్న ప్రాజెక్ట్ హెల్త్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం, ఆరోగ్యంపై అవగాహన పెంచడం, అవసరమైన వారికి వైద్య సేవలను మరింత చేరువ చేయడం ప్రధాన లక్ష్యం.
(వీడియోస్ మెడికల్ టీమ్)
ఈ కార్యక్రమానికి వైద్య బృందం తరఫున ఆహ్వానించబడిన వారు:
డా. ధరావత్ రెడ్డి,మెడికల్ డైరెక్టర్ డా. శివకాంత్ అలోర్ ఎండీ , ఎంఆర్సిపి (లండన్ )కన్సల్టెంట్ ఫిజిషియన్ & డయాబెటాలజిస్ట్ డా. సయ్యద్ ఓవైస్ హష్మీ ఎండి జనరల్ ఫిజీషియన్ ఆరోగ్యమే మహాభాగ్యం ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే మా లక్ష్యం. అని యజమాన్యం తెలియజేశారు

# అరకును గ్లోబల్ కాఫీ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతాం : సీఎం చంద్రబాబు



అరకును ప్రపంచ స్థాయి కాఫీ కేంద్రంగా (ప్రీమియర్ గ్లోబల్ కాఫీ డెస్టినేషన్) తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రియాశీలకంగా పెట్టుబడులు పెడుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అంతర్జాతీయ కాఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఉదయం ఒక కప్పు కాఫీ తాగనిదే కోట్లాది మందికి రోజు ప్రారంభం కాదని, తన దినచర్య కూడా అరకు కాఫీతోనే మొదలవుతుందని చంద్రబాబు 'ఎక్స్' వేదికగా తెలిపారు. "అరకు.. ఆంధ్రప్రదేశ్ ఘనమైన వారసత్వ సంపదకు ప్రతీక. మన రాష్ట్రంలోని కొండ ప్రాంతాల నుంచి ప్రపంచవ్యాప్తంగా కాఫీ కప్పుల వరకు అరకు కాఫీ సాగించిన అద్భుత ప్రయాణాన్ని ఈ అంతర్జాతీయ కాఫీ దినోత్సవం రోజున జరుపుకుందాం" అని ఆయన పేర్కొన్నారు. స్థానిక రైతులను ప్రోత్సహిస్తూ, ప్రపంచ కాఫీ పటంలో ఆంధ్రప్రదేశ్‌కు సరైన స్థానం కల్పించడమే తమ లక్ష్యమని చంద్రబాబు వివరించారు.ఇదే సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా అంతర్జాతీయ కాఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అరకు కాఫీ విశిష్టతను వివరిస్తూ, "ప్రతి కప్పు అరకు కాఫీలో తూర్పు కనుమల సౌరభం, అక్కడి నేల సారం, మన గిరిజన రైతుల కఠోర శ్రమ ఇమిడి ఉన్నాయి" అని అన్నారు.అరకు కాఫీ కేవలం రుచి, సువాసనలకు మాత్రమే పరిమితం కాదని, అది మన అడవులు, గిరిజన సంఘాలు, వారి సంప్రదాయ జ్ఞానం మధ్య ఉన్న బంధానికి ప్రతీక అని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్న ఈ స్థానిక ఉత్పత్తి, అరకు లోయల నుంచి ఢిల్లీలోని పార్లమెంట్ వరకు ప్రయాణించిందని, అక్కడ ప్రత్యేక స్టాళ్ల ద్వారా ప్రదర్శించబడిందని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా అరకు కాఫీని, దాని సాగుతో ముడిపడి ఉన్న గిరిజన కుటుంబాల కృషిని పలుమార్లు ప్రశంసించారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు."ఒక కప్పు అరకు కాఫీ అంటే మన నేల రుచి, మన ప్రజల కథ, మన తూర్పు కనుమల సువాసన" అని పవన్ కల్యాణ్ అభివర్ణించారు. మొత్తంగా, అంతర్జాతీయ కాఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర నాయకత్వం అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకురావాలనే తమ సంకల్పాన్ని పునరుద్ఘాటించింది.

# ఫోటో : పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న మందిర చైర్మన్, నిర్వాహకులు

## సిల్వర్ జూబ్లీ వేడుకలను విజయవంతం చేయండి



హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
శ్రీ సాయి మీరా కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 19న నిర్వహించే సిల్వర్ జూబ్లీ వేడుకలను విజయవంతం చేయాలని సాయిబాబా మందిర చైర్మన్ హరగోపాల్ శర్మ కోరారు. గురువారం హనుమకొండ శ్రీదేవి ఏషియన్ మాల్ ప్రాంతంలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో శ్రీ సాయి మీరా కల్చరల్ సొసైటీ సిల్వర్ జూబ్లీ వేడుకల కరపత్రాన్ని సాయిబాబా పాదాల చెంత పెట్టి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మందిర చైర్మన్ మతుకు మల్లి హరగోపాల్ శర్మ, శ్రీ సాయి మీరా కల్చరల్ సొసైటీ వ్యవస్థాపకులు,చైర్మన్ కర్ణకంటి పోతనాచారి విశ్వకర్మ మాట్లాడుతూ శ్రీ సాయి మీరా కల్చరల్ సొసైటీ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంలో డిసెంబర్ 19న హనుమకొండ బాలసముద్రంలోని కాళోజి కళాక్షేత్రంలో నిర్వహించే సిల్వర్ జూబ్లీ మహోత్సవాలను ఆదరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకలలో భారతీయ శాస్త్రీయ సంగీత కచేరి, శాస్త్రీయ నృత్యాలు, బోనాలు, బతుకమ్మ ఆటలు,తెలంగాణ జానపద గేయ కళా రూపాలు, విశ్వంభరా కవుల సమ్మేళనం,సరిగమప సినీ సంగీత లహరి,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి పరిమళాలు, కాకతీయ కళాబైపోవపు వెలుగులు, భారతీయ శాస్త్రీయ కళల మధుర సమ్మేళనంగా సాగే ఈ అపూర్వ సాంస్కృతిక మహోత్సవానికి కవులు,కళాకారులు,సంగీత ప్రియులు,హితులు,శ్రేయోభిలాషులు,ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మందిర ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా కోశాధికారి డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ , వాణిశ్రీ, పద్మజా రెడ్డి, జయశ్రీ, శ్రీమన్నారాయణ, సుధాకర్, ఉపేందర్,..... తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# గిఫ్ట్ గార్డెన్ ప్రారంభించిన విష్ణు రెడ్డి..



హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో నక్కలగుట్ట నూతనంగా ఏర్పాటు చేసిన గిఫ్ట్ గార్డెన్ ను గురువారం రోజు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారి అల్లుడు శ్రీ విష్ణు రెడ్డి గారు ముఖ్య అతిథులుగా హాజరై ఘనంగా ప్రారంభించారు.
ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసి,కస్టమర్లకు అందుబాటు ధరలలో నాణ్యమైన బహుమతులను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాయిని లక్ష్మా రెడ్డి,స్థానిక డివిజన్ అధ్యక్షులు కరీం,నాయకులు కొండా నాగరాజు ,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ వింగ్ డైరెక్టర్ రామ్‌ధన్‌కు అభినందన సత్కారం



హైదరాబాద్, అక్టోబర్ 01:
తెలంగాణ ఆహార మరియు అత్యవసర ఔషధ ప్రమాణాల ప్రాధికార సంస్థ డ్రగ్స్ వింగ్ డైరెక్టర్‌గా నియమితులైన శ్రీ జి. రామ్‌ధన్‌ను గ్రేటర్ హైదరాబాద్ రెసిడెంట్ మెడికల్ సేల్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. తెలంగాణలో ఔషధ భద్రత, నియంత్రణ వ్యవస్థ మరియు ప్రజారోగ్య పరిరక్షణలో ఇది ఒక గర్వించదగ్గ మైలురాయి అని కొనియాడారు. రామ్‌ధన్ గారి నాయకత్వం, సుదీర్ఘ అనుభవంతో రాష్ట్రంలో ఔషధ నియంత్రణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన తన నూతన బాధ్యతల్లో ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కిషన్ మురారిశెట్టి, లక్ష్మణ్ వనమాల, సుభాష్ గౌడ్, కృష్ణ కుమార్, రాజేందర్ గగడ్, లలిత్ భాయ్, శ్రీనివాస్, సురేష్, విశ్వకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల ప్రశాంత నిర్వహణ

## కాచిగూడ ఇన్‌స్పెక్టర్‌కు అభినందనలు



కాచిగూడ, అక్టోబర్ 01:
నెహ్రూ నగర్ మరియు కాచిగూడ పరిసర ప్రాంతాలలో శ్రీ గణేష్ ఉత్సవాలను అత్యంత ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించినందుకు కాచిగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్ . రాజశేఖర్ గారిని శ్రీ ఉమేశ్వర దేవాలయ కమిటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలు కాపాడటంలో, ప్రజా సామరస్యాన్ని పరిరక్షించడంలో కాచిగూడ పోలీసు యంత్రాంగం నిరంతరం శ్రమించి విశేష కృషి చేసిందని కొనియాడారు. పోలీసుల సమర్థవంతమైన పనితీరును అభినందిస్తూ ఇన్‌స్పెక్టర్ ఎస్ . రాజశేఖర్ గారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఉమేశ్వర దేవాలయ కమిటీ సభ్యులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ నిరసన ర్యాలీ

**రేపు అనగా 2 అక్టోబర్ 2026, ఉదయశీ 10 గ ''**

**తెలంగాణ అమరవీరుల స్తూపం నుండి ర్యాలీ నిర్వహించడం జరుగుతుంది.**

1. చీఫ్ ఎలక్షన్ కమీషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలి
2. -సర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి.
3. స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థలను విధ్వంసం చేస్తున్న బిజెపి విధానాలను ఖండిద్దాం.
4. లౌకిక, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం, బిజెపి తెస్తున్న పాసిజాన్ని ఓడిద్దాం.
5. ఎలక్షన్ కమీషనర్ల ఎంపిక పద్ధతి మార్పు చేయాలి. ప్రధానమంత్రి, చీఫ్ జస్టిస్ తో పాటు, రాజకీయ పార్టీల ప్రాతినిధ్యం ఉండాలి

ప్రజా సంఘాల ఐక్యవేదిక మిర్యాలగూడ

# ఓబీసీ సింహగర్జన సన్నాహక సమావేశం విజయవంతం కావాలి

## : రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

**హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి అక్టోబర్ 1**

రాష్ట్రంలో బీసీల హక్కుల సాధన, రాజకీయ ప్రాధాన్యం సంక్షేమమే ధ్యేయంగా ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్న ప్రతిష్టాత్మక ఓబీసీ సింహగర్జన కార్యక్రమ సన్నాహక సమావేశం రాజేంద్రనగర్ నియోజక వర్గం శంషాబాద్ లోని గొల్లపల్లి రోడ్డులో నిర్వహించడం జరిగింది. లిటీపీసీసీ ఓబీసీ ఛైర్మన్, షాద్‌నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ లి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ సలహాదారులు వి. హనుమంత్ రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సన్నాహక సమావేశంలో లిరంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రత్యేకంగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బీసీల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని, వారి హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 4న తలపెట్టిన 'ఓబీసీ సింహగర్జన' సభను చారిత్రాత్మక విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా నుండి ఓబీసీ నాయకులు, కార్యకర్తలు, యువకులు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బీసీ వర్గాల అణచివేతకు వ్యతిరేకంగా, వారికి తగిన రాజకీయ మరియు సామాజిక అవకాశాలు దక్కేలా ఈ గర్జన వేదికగా గట్టి సందేశం ఇస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మాజీ డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఛైర్మన్ అజయ్, వైస్ ఛైర్మన్ బంగారి బాబు, నియోజకవర్గ ఇంచార్జీలు భీం భరత్,



జగదీశ్వర్ గౌడ్, ముద్దగౌని వేణు గౌడ్, ఓబీసీ కన్వీనర్లు డా.ధనలక్ష్మి, డా.వెంకటేష్ పీసీసీ మెంబెర్స్ అయిల్ల శ్రీనివాస్ గౌడ్, కొత్తకూర్మ శివ కుమార్, నాయకులు, ఓబీసీ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల ఇంటికే బీఎల్ఓలు

## - ఎస్ఐఆర్‌లో నోటీసులు, పత్రాలు ఇంటి వద్దే స్వీకరణ

## - వరంగల్‌లో 90,214 హియరింగ్‌లు పెండింగ్.. - వారం రోజుల్లో పూర్తి

**వరంగల్, అక్టోబర్ 1, హైదరాబాద్ ఎస్టేట్:**

ఎస్ఐఆర్2026 ప్రక్రియలో భాగంగా ఓటర్లను నోటీసులు తీసుకోవడానికి, పత్రాలు సమర్పించడానికి ఎన్నికల కార్యాలయాలకు పిలవరాదని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు అవసరమైన పత్రాలను ఇంటి వద్దే స్వీకరించాలని ఆదేశించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఎస్ఐఆర్2026, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు అంశాలపై గురువారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఈఓ సమీక్షించారు. సాధారణంగా ఓటర్లను విచారణ కోసం కార్యాలయాలకు పిలవరాదని, తప్పనిసరి పరిస్థితుల్లో ఆన్‌లైన్ విధానంలో విచారణ నిర్వహించాలని ఆదేశించారు. కొత్త ఓటరు నమోదుకు సమర్పించే ఫారం6తో డిక్లరేషన్




తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని వివరించారు. జిల్లాలో మొత్తం 1,94,395 హియరింగ్‌లకు గాను ఇప్పటివరకు 1,04,181 హియరింగ్‌లు పూర్తయ్యాయని తెలిపారు. ఇంకా 90,214 హియరింగ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వారం రోజుల్లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈఆర్ఓ కార్యాలయాల నోటీసు బోర్డులపై ఫారం6, ఫారం7కు సంబంధించిన పెండింగ్, పరిష్కరించిన



దరఖాస్తుల వివరాలను ప్రదర్శించాలని సీఈఓ సూచించారు. ఫారం6, పెండింగ్ నోటీసులు, ఫారం7, ఫారం8కు సంబంధించిన వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఎల్. కిషోర్, వై.వి. గణేష్, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, ఎన్నికల సూపరింటెండెంట్ రజిని తదితరులు పాల్గొన్నారు.

# నాంపల్లి విద్యుత్ ఏడి కార్యాలయం ముందు బీఆర్ఎస్ పార్టీ ధర్నా

## - విద్యుత్ కోతలు లో వోల్టేజ్ తో కష్టాలుపడుతున్న రైతాంగానికి మద్దతుగా మహాధర్నా

## - మునుగోడు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

**మర్రిగూడ (నాంపల్లి) అక్టోబర్ 01 (హైద్రాబాద్ ఎస్టేట్):----**
నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం నాంపల్లి మండల కేంద్రంలో గురువారం నాంపల్లి విద్యుత్ ఏడి కార్యాలయం ముందు మునుగోడు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు ఎల్ నినో ప్రభావంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ అందించాలని ఆయన డిమాండ్ చేశారు రైతులు వేసిన పంటలకు వర్షాలు పడక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని విద్యుత్ అంతరాయంతో రైతులు పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని ఆయన అన్నారు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి మీద ఉన్న ధ్యాస రైతుల మీద లేదని ఆయన అన్నారు కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో ఎవరికి తెలవని పరిస్థితి ఉందని ఆయన అన్నారు తెలంగాణ ప్రజలు ముక్తకంఠంతో """కెసిఆర్ రావాలి రేవంత్ పోవాలి "నినాదంతో ఉన్నారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పల్లె రవికుమార్ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు నాంపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ



నాయకులు కార్యకర్తలు మర్రిగూడ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పలువురు ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు సర్పంచులు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# పట్టభద్రుల ఓటర్ల నమోదుపై బీజేపీ కసరత్తు

## - ఫారం18పై అర్హులైన పట్టభద్రులకు అవగాహన కల్పించాలి : కొండేటి శ్రీధర్

**హన్మకొండ, అక్టోబర్ 1, హైదరాబాద్ ఎస్టేట్:**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియపై బీజేపీ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో గురువారం హన్మకొండలోని సత్యం కన్వెన్షన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ పాల్గొని ఓటర్ల నమోదుపై నాయకులు, కార్యకర్తలకు సూచనలు చేశారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ.. వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి కొత్తగా ఓటర్ల జాబితా రూపొందిస్తున్న నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఫారం18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో పట్టభద్రుల ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు కూడా తాజా ప్రక్రియలో మళ్లీ దరఖాస్తు చేయాల్సి ఉంటుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో పట్టభద్రులకు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా నాయకులు, మండల అధ్యక్షులు, ఇన్‌చార్జిలు,




కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి డా. వన్నాల వెంకటరమణ, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్ రెడ్డి, డా. కంభంపాటి పుల్లారావు, జలగం రంజిత్ రావు, మంజుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండల అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, మహిళా నాయకులు, సర్పంచులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, సీనియర్ నాయకులు హాజరయ్యారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in

02,అక్టోబర్ శుక్రవారం 2026

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి అర్హుడినీ ఓటరుగా నమోదు చేయించాలి

**- బిజెపి నాయకులు ఎమ్మెల్సీ శ్రీ అంజిరెడ్డి**

**వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రణాళికాబద్ధంగా పనిచేసి పార్టీ విజయం కోసం కృషి చేయాలి.**

**- బిజెపి జిల్లా ఇంచార్జి, మాజీ ఎంపీ శ్రీ డా.బూర నర్సయ్య గౌడ్.**

హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ

వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల (గ్రాడ్యుయేట్స్) ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల నమోదు ప్రక్రియపై గురువారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బ్యాంక్వేట్ హాల్ లో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి గారి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎంపీ శ్రీ బూర నర్సయ్య గౌడ్ హాజరై కార్యకర్తలకు, నాయకులకు రాబోయే ఎన్నికలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య బలోపేతానికి పట్టభద్రుల ఓటు హక్కు కీలకమైనదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడినీ ఓటరుగా నమోదు చేయించేందుకు కార్యకర్తలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి, ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రణాళికాబద్ధంగా పనిచేసి రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని స్పష్టం చేశారు. ఈ సన్నాహక సమావేశంలో బీజేపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ పోటీ చేసిన అభ్యర్థి శ్రీమతి రావు పద్మ రెడ్డి, పరకాల నియోజకవర్గ అభ్యర్థి డా. పగడాల కాళీప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, బీజేపీ రాష్ట్ర నాయకులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, నాయకులు డా. వన్నల వెంకటరమణ, నెమ్మని మహేష్, చాడ స్వాతి రెడ్డి, డా. పెసరు విజయ్ చందర్ రెడ్డి, దొంతి దేవేందర్ రెడ్డి, దాస్యం అభినవ్ భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్. పి. జయంత్ లాల్, సంద్ర మధు, జిల్లా పదాధికారులు, డివిజన్ మరియు మండల అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా నన్నేసాహెబ్

**- విద్యార్థుల అభ్యున్నతికి చేసిన సేవలకు గుర్తింపు**

**నడికూడ, అక్టోబర్ 1, హైదరాబాద్ ఎస్టేట్:**

విద్యార్థుల అభ్యున్నతికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ధర్మారం ప్రధానోపాధ్యాయులు ఎస్.డి. నన్నేసాహెబ్ నడికూడ మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో అధికారులు ఆయనకు అవార్డును అందజేసి శాలువాతో సత్కరించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల విద్యాశాఖ అధికారి, పీజీ హెచ్‌ఎంలు నన్నేసాహెబ్‌కు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల ప్రగతికి ఆయన చేస్తున్న కృషిని అధికారులు అభినందించారు. అవార్డు స్వీకరించిన నన్నేసాహెబ్ మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి గౌరవించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారం తనపై బాధ్యతను మరింత పెంచిందని, విద్యార్థుల అభ్యున్నతితో పాటు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొని



నన్నేసాహెబ్‌కు అభినందనలు తెలిపారు.

# బుజరంపేట్‌లో గణనాథుడి నిమజ్జనం ఘనంగా

**భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు.. ఉత్సాహంగా లడ్డూ వేలం.. వైభవంగా శోభాయాత్ర**

కౌడిపల్లి హైదరాబాద్ ఎస్టేట్ అక్టోబర్ 1

మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం బుజరంపేట్ గ్రామంలో బజరంగ్ దళ్ యూత్ ఆధ్వర్యంలో చిట్టెం గడ్డ వద్ద ప్రతిష్ఠించిన శ్రీ గణనాథుడి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ గణనాథుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడంతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గణనాథుడి లడ్డుకు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో గ్రామస్థులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. లడ్డును దక్కించుకునేందుకు పలువురు భక్తులు పోటీపడి వేలం పాట పాడారు. వేలం ఉత్కంఠభరితంగా సాగగా చివరకు కౌడిపల్లి గోపాల్, ఉప సర్పంచ్ రూ. 37,551లకు గణనాథుడి లడ్డును దక్కించుకున్నారు.

అదేవిధంగా రెండవ లడ్డుకు కూడా భక్తుల నుంచి మంచి స్పందన లభించింది. ఆకుల శేఖర్ రూ. 31,551లకు రెండవ లడ్డును దక్కించుకున్నారు. వేలం పాట సందర్భంగా గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా సందడి చేశారు.

వైభవంగా గణనాథుడి శోభాయాత్ర



లడ్డూ వేలం అనంతరం గణనాథుడి శోభాయాత్రను బజరంగ్ దళ్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గణనాథుడిని ప్రతిష్ఠించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. యువత, మహిళలు, చిన్నారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డప్పుల మోతలు, భక్తుల నృత్యాలు, గణపతి నామస్మరణలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. యువత ఉత్సాహంగా పాల్గొని శోభాయాత్రను ముందుకు నడిపించారు. పలుచోట్ల భక్తులు గణనాథుడికి హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

“గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా” అంటూ భక్తులు నినాదాలు చేస్తూ గణనాథుడికి వీడ్కోలు పలికారు. అనంతరం భక్తిశ్రద్ధలతో గణనాథుడిని నిమజ్జనం చేశారు.

ఘనంగా ముగిసిన ఉత్సవాలు

నవరాత్రుల పాటు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, చివరి రోజు లడ్డూ వేలం, శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడంతో ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

ఈ సందర్భంగా బజరంగ్ దళ్ యూత్ సభ్యులు మాట్లాడుతూ, గణనాథుడి నవరాత్రి ఉత్సవాలకు సహకరించిన గ్రామస్థులకు, భక్తులకు, యువతకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా గ్రామస్థుల సహకారంతో ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

గణనాథుడి నిమజ్జనంతో బుజరంపేట్ గ్రామంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమం లో పాలుగోన్నారు సర్పంచ్ పట్లోళ్ల శ్రీనివాస్, ఉప సర్పంచ్ కౌడిపల్లి గోపాల్, నాయికోటి లింగం, నాయికోటి శ్యామ్ సుందర్ రావు, కర్నె జగన్మోహన్ రెడ్డి, బజరంగ్దళ్ యూత్ సభ్యులు గ్రామస్థుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తల్లి వర్ధంతి.. బాలకృష్ణ ఎమోషనల్ పోస్ట్

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన మాతృమూర్తి, స్వర్గీయ శ్రీమతి బసవతారకం వర్ధంతి సందర్భంగా ఆమెను స్మరించుకుంటూ భావోద్వేగభరిత నివాళి అర్పించారు. అమ్మ భౌతికంగా తమ మధ్య లేకపోయినా, ఆమె ప్రేమ, ఆశీస్సులు ఎప్పటికీ తమతోనే ఉంటాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన మనసులోని మాటలను పంచుకున్నారు.“మా అమ్మ శ్రీమతి బసవతారకం గారి వర్ధంతి సందర్భంగా నా హృదయపూర్వక నివాళులు. అమ్మ భౌతికంగా మా మధ్య లేకపోయినా.. ఆమె ప్రేమ, ఆమె ఆశీస్సులు, ఆమె చూపిన మార్గం ఎప్పటికీ మా జీవితాల్లో సజీవంగానే ఉంటాయి. ఆమె చూపిన అపారమైన మమకారం, ఆమె పోరాటం వెనుక నిలిచిన అసాధారణ ధైర్యం, ఆమె మాకు నేర్పిన విలువలు.. నేటికీ నా జీవితాన్ని నడిపించే శక్తిగా నిలిచాయి.
ఆమె జ్ఞాపకాలను కేవలం మనసులో దాచుకోవడం మాత్రమే కాదు.. ప్రతి పేదవాడికీ, ప్రతి రోగికీ ఆశాకిరణంగా నిలుస్తున్న బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రూపంలో ఆమె పేరు, ఆమె సంకల్పం చిరస్థాయిగా నిలవడం, ఆమె సేవా స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడం నాకు ఎంతో గర్వకారణం. ఎందరో జీవితాల్లో ఆశను నింపుతున్న ఈ సేవా ప్రయాణం ఆమె ఆశయాలకు నిజమైన నివాళిగా నిరంతరం కొనసాగాలని కోరుకుంటున్నాను. అమ్మ



చల్లని ఆశీస్సులు ఎల్లప్పుడూ మా అందరిపై ఉండాలని ప్రార్థిస్తున్నాను“ అంటూ బాలకృష్ణ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు

# మొక్కల సంరక్షణలో చేయూత ఫౌండేషన్




గుంటూరు 29 - 09 - 2026

గుంటూరు నగరంలో ఎకో పార్క్ లో నాటిన వెయ్యి మొక్కలను సంరక్షించే బాధ్యతను చేయూత ఫౌండేషన్ చేపట్టి ఈనెల 29వ తేదీన గుంటూరులోని హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ మరియు టిజెపిఎస్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సహకారంతో మొక్కల సంరక్షణ కార్యక్రమాన్ని చేయూత ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మరియు సౌత్ కోస్టల్ రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ ఎస్. మంజునాథ్ నేతృత్వంలో జరిగింది. ఈ సందర్భంగా వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ప్రపంచ వ్యాప్తంగా సగటున ఒక్కొక్కరికి 422 చెట్లు ఉండగా ఇండియాలో 28 చెట్లు మాత్రమే ఉన్నాయని కెనడాలో 8953 చెట్లు, రష్యాలో 4461 చెట్లు, ఆస్ట్రేలియాలో 3266 చెట్లతో అగ్రభాగాన ఉన్నాయని ఈజిప్ట్, ఖదర్, ఉమెన్, మొనాకో లాంటి దేశాలలో ఒక చెట్టు లోపు మాత్రమే ఉంటూ అత్యల్ప స్థాయిలో ఉన్నాయన్నారు. ప్రపంచ భూభాగంలో 31 శాతం అడవులు ఉండగా ఇండియాలో 25 శాతం, ఆంధ్రప్రదేశ్ 18 శాతం గా ఉంటే గుంటూరు జిల్లాలో కేవలం 7 శాతంతో అతి తక్కువ స్థాయిలో ఉందన్నారు. ప్రపంచంలో ఉష్ణోగ్రత వేగంగా పెరుగుతున్న నేటి పరిస్థితుల్లో కోట్లాది మొక్కలు నాటి సంరక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పట్టణీకరణ, రోడ్ల విస్తరణ, మైనింగ్, జనాభా పెరుగుదల లాంటి కారణాలతో చెట్లు నరికివేత పెరుగుతుందని మనదేశంలో 500 కోట్ల చెట్లను పెంచితే గాని పర్యావరణాన్ని కాపాడుకోలేమన్నారు. గత 80 సంవత్సరాలలో నాటిన కోట్లాది మొక్కలలో కేవలం రెండు శాతం మాత్రమే మొక్కలను సంరక్షించి చెట్లగా పెంచగలిగామన్నారు. సౌత్ కోస్టల్ రైల్వేస్ మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ ఎస్. మంజునాథ్ ప్రసంగిస్తూ నెలరోజుల క్రితం ఎకో పార్కులో నాటిన వేయి మొక్కల్లో కేవలం ఒక శాతం మాత్రమే చనిపోయాయని తెలిపారు. ప్రముఖ సేవా తత్పరులు రేమాండ్స్ అధినేత త్రిపుర మల్లు అరుణ్ కుమార్ ఉచితంగా అందించిన ట్యాంకర్ తో మొక్కలకు నిరంతరం నీరు అందిస్తున్నామని వివరించారు. బహుముఖ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న కోవిడ్ ఫైటర్స్ మొక్కలకు నిరంతరం నీరు అందించే బాధ్యతను స్వీకరించడం అభినందనీయమన్నారు. టిజెపిఎస్ మరియు హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మొక్కలకు నీరు సమృద్ధిగా అందించడానికి పాదులు చేసి వాటికి చేయూత నివ్వడానికి కర్రలు ఉంచటం ,చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటడం లాంటి కార్యక్రమాలను జయ ప్రదంగా నిర్వహించి పని సంస్కృతికి నిదర్శనంగా నిలిచినారన్నారు. ఈ కార్యక్రమంలో టిజెపిఎస్ కళాశాల అధ్యాపకులు గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి డా॥ జె.వి. సుధీర్ కుమార్, హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బొందిలి పవన్ సాయి రామ్ సింగ్, ల్యాబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ షేక్ ఖాదర్ బాషా, కోవిడ్ ఫైటర్స్ వ్యవస్థాపకులు షేక్ పఠాన్ అల్లాబక్షు, మానవత అధ్యక్షులు పోలూరి వీరారెడ్డి, సభ్యులు టి.వి. సాయిరాం, మేకల రామారావు, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణ రెడ్డి, కెబిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలరాజు, ప్రముఖ ప్రజా గాయకులు పి.వి. రమణ, పవన్ జోవిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు పవన్, చేయూత ఫౌండేషన్ సభ్యులు టి. ధనుంజయ రెడ్డి, మాదిగ జన సేవా సమితి నేత పుసులూరి విజయ్, రైల్వే చీఫ్ డిపో మెటీరియల్ సూపరింటెండెంట్ వంక రామశేషారెడ్డి మొక్కల సంరక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజన సదుపాయం ప్రముఖ వ్యాపారవేత్త వణుకూరి సుబ్బారెడ్డి కల్పించినారు.

# ఏపీ స్థానిక ఎన్నికలపై హైకోర్టు కీలక తీర్పు..

# 34% బీసీ రిజర్వేషన్లు రద్దు!



ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 104, 1065లను రద్దు చేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఈ జీవోలు ఉల్లంఘిస్తున్నాయని స్పష్టం చేసింది. ఆరు వారాల్లోగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది.
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు, వార్డుల పునర్విభజన, ఎన్నికల వాయిదా తదితర అంశాలపై దాఖలైన పలు పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించడం వల్ల మొత్తం రిజర్వేషన్ల కోటా 50 శాతాన్ని దాటుతోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్లు వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, రిజర్వేషన్లు 50 శాతం లోపే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తూ సదరు జీవోలను కొట్టివేసింది. అదే సమయంలో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేసింది. వార్డుల పునర్విభజన ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ‘సర్‘ ప్రక్రియ పూర్తయ్యాకే ఎన్నికలు జరపాలంటూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు, బీసీ జనాభా గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలను కూడా కోర్టు కొట్టివేసింది. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సైతం తోసిపుచ్చింది. మొత్తం మీద ఎన్నికల ప్రక్రియను నిలిపివేయడానికి హైకోర్టు నిరాకరించింది. కేవలం రిజర్వేషన్ల శాతాన్ని మాత్రమే సమీక్షించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో స్థానిక పోరుకు అడ్డంకులు తొలగిపోయాయి. అయితే, ఇప్పుడు ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎలా ముందుకు వెళుతుంది? కోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితికి లోబడి కొత్త ఫార్ములాను ఎలా రూపొందిస్తుంది? అనేది ఆసక్తికరంగా మారింది. కోర్టు ఆదేశాల మేరకు ఆరు వారాల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండటంతో ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై ఒత్తిడి పెరిగింది.